క్లుప్తంగా

ఘనంగా పాస్టర్స్ డే



వర్ధన్నపేట : మండలంలోని నల్లబెల్లిలో పాస్టర్స్ డే వేడుకలు ఆదివారం నిర్వహించారు. గ్రామంలోని ఎక్లెషియా పెంతకోస్తు చర్చిలో సంఘ పెద్దలు రజితకుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం పాస్టర్ సుమన్ అరుణలను పూలబొకే అందించి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎలియా, స్వరూపబాబు, కృష్ణవేణి, దయాకర్, పూలమ్మ, మానస, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీడీఎస్ కార్యవర్గం ఎన్నిక


రవి


సురేందర్

ఖానాపురం : మండలంలోని ధర్మారావుపేటలో విలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తోట రవి, ప్రధాన కార్యదర్శిగా కొండా సురేందర్, ఉపాధ్యక్షులుగా అశోక్, కిరణ్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా ప్రశాంత్, అనిల్, కోశాధికారిగా సాంబరాజు, గౌరవ అధ్యక్షులుగా కృష్ణ, వెంకన్న, సుధాకర్, కుమారస్వామితోపాటు సలహాదారులు, సభ్యులను ఎన్నుకున్నారు.

ఇందిరమ్మ కమిటీ ఎన్నిక



రాయపర్తి : మండలంలోని సన్నూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తండాల యాకయ్య ఆధ్వర్యంలో ఇందిరమ్మ గ్రామ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామానికి చెందిన కుందూరు రమేశ్‌రెడ్డి, తునికి అమృతమ్మ, చెరిపెల్లి సులోచన, చిన్నపాక రాజు, ఆబోతు చేరాలు సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా యాకయ్య మాట్లాడారు. గ్రామ అభివృద్ధికి కమిటీ పాటుపడుతుందని చెప్పారు. సమస్యను ప్రభుత్వ, అధికారుల, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన అభివృద్ధి పనులు సాధించే దిశగా చొరవ తీసుకుంటామని తెలిపారు.

ఆర్థికసాయం



చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన మండల మల్లయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడి కుమారుడు రమేశ్ పదో తరగతి నాటి మిత్రులు ఆదివారం రూ.26,500 సాయం అందజేశారు. తొలుత మల్లయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పరామర్శించారు. కార్యక్రమంలో సుంకరి సంతోశ్‌రెడ్డి, మొగిలి వెంకట్‌రెడ్డి, కడారి రమేశ్, పోలబోయిన పవన్, ఆయాస్, బోదాసు పూర్ణచందర్, సదానందం, పల్లకొండ కుమారస్వామి, ఆరె రాజు, అనిల్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

రాయపర్తి : మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన ఎర్ర రాజు, ఈదునూరి అన్వేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబాలను బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదివారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం పన్యానాయక్‌తండాకు చెందిన భూక్య మధు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని దయాకర్‌రావు కలిసి ఓదార్చారు. తొలుత మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, నాయకులు పూస మధు, గట్టు నర్సింహాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు..

ఆత్మకూరు: మండలంలోని పెద్దాపూర్, పెంచికలపేట, హౌజుబుజుర్గ్, తిరుమలగిరి గ్రామాల్లో వివిధ కారణాలతో కుటుంబ సభ్యులు మృతిచెందినవారిని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదివారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

పాఠశాలలో మందు బాబుల వీరంగం

దామెర: మండలంలోని పులుకుర్తిలో మందు బాబుల ఆగడాలు మితిమీరుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలనే అడ్డగా చేసుకొని కొంతమంది ఆకతాయిలు మద్యం సేవిస్తున్నారు. అంతే కాకుండా ఖాళీ సీసాలను అక్కడే వదిలి వెళ్లడంతో వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గతంలో పాఠశాల ఆవరణలో, ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో మద్యం సేవించి సీసాలు, గ్లాసులు వదిలి వెళ్లినట్లు చెబుతున్నారు. పోలీసులు దృష్టి సారించి మందు బాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.


సంగెం : రామచంద్రాపురంలో దహనమవుతున్న రావణాసురుడి ప్రతిమ


పర్వతగిరి : దసరా ఉత్సవాలకు వస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, మాజీ మంత్రి ఎర్రబెల్లి


రాయపర్తి : దుర్గామాత పూజల అనంతరం భక్తులతో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

వైభవంగా విజయదశమి వేడుకలు

జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, పర్వతగిరి, దుగ్గొండి, చెన్నారావుపేట, నెక్కొండ, సంగెం, గీసుకొండ, ఖానాపురం, రాయపర్తి మండలాల్లో విజయదశమి వేడుకలను ప్రజలు శనివారం వైభవంగా జరుపుకున్నారు. ఆలయాల్లో శమీ పూజలు వేడుకగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు ఆయుధ పూజ చేశారు. జనసందోహం నడుమ రావణాసుర వధ నిర్వహించారు. పలు చోట్ల జమ్మి చెట్టును ప్రజలు పూజించారు. పాలపిట్టను చూసి సందడి చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిర్వాహక కమిటీలు ఏర్పాట్లు చేశాయి. పోలీసులు బందోబస్తు చేపట్టారు. చెన్నారావుపేట మండలంలోని అక్కల్‌చెడ గ్రామంలో వేద పండితులు లేకపోవడంతో జమ్మి చెట్టు వద్ద శమీ పూజకు బదులు గ్రామస్తులు, పెద్దలు జనగణమన (జాతీయ) గీతాన్ని ఆలపించి ప్రత్యేకత చాటారు.

-సాక్షి నెట్‌వర్క్


నెక్కొండ : ఆయుధ పూజలో పాల్గొన్న సీఐ, ఎస్సై


సంగెం : ఆయుధపూజ చేస్తున్న ఎస్సై, సిబ్బంది


దుగ్గొండి : జమ్మి పూజలో పాల్గొన్న ఎస్సై వెంకటేశ్వర్లు


దుగ్గొండి : నాచినపల్లిలో దసరాకు ఖడ్గంతో బయలుదేరిన గ్రామపెద్ద, ప్రజలు


చెన్నారావుపేట : జమ్మిచెట్టుకు పూజ చేస్తున్న భక్తులు


రాయపర్తి : కాట్రపల్లిలో..


ఖానాపురం : ఆయుధ పూజ చేస్తున్న ఎస్సై

స్థానిక సమస్యల పరిష్కారంలో వివక్ష

● రోడ్డుపై బైఠాయించి ప్రజల నిరసన

వర్ధన్నపేట : పట్టణంలోని 7, 8, 12 వార్డుల్లోని సమస్యలను పరిష్కరించకుండా మునిసిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, అధికారులు వివక్ష పాటిస్తున్నారంటూ ఆ ప్రాంతాల ప్రజలు పట్టణంలోని రోడ్డుపై బైఠాయించి ఆదివారం నిరసన తెలిపారు. మునిసిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సదరు వార్డుల ప్రజలు విలేకరులతో మాట్లాడారు. రెండేళ్లుగా వార్డులపై వివక్ష చూపుతున్నారని వాపోయారు. దసర ఉత్సవాల్లో భాగంగా ఎలాంటి ఏర్పాట్లు చేయలేదని, సౌకర్యాలు కల్పించలేదని చెప్పారు. కొన్ని నెలలుగా వార్డుల్లో పారిశుద్ధ్య పనులు జరగడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. దోమలు, ఈగలు ప్రబలి ప్రజలు రోగాల బారిన పడుతున్నా మునిసిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. పిరంగిగడ్డ ప్రాంతంపై వివక్ష పాటిస్తున్నారని మండిపడ్డారు. వెంటనే వార్డుల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టడంతోపాటు ఇతర అన్ని సమస్యలనూ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. స్థానిక పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చి ఆందోళన విరమింపజేశారు.


ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


చెన్నారావుపేట : నాటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

ఖానాపురం : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 1996–97 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు. సమ్మేళనానికి హాజరు కాని స్నేహితులను కూడా కలుసుకోవాలని, స్నేహాన్ని కొనసాగించాలని, వీలైతే సామాజిక సేవలు నిర్వహించాలని ఐక్యంగా నిర్ణయించుకున్నారు. స్కూల్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వీరమనేని సాగర్‌రావు, అజహర్, తదితరులు పాల్గొన్నారు.


ఖానాపురం : ప్రభుత్వ హైస్కూల్‌లో..

జాగృతి స్కూల్‌లో..

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని జాగృతి హైస్కూల్‌లో 2006–07 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు కలుసుకుని ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం నాడు విద్యాబోధన చేసిన గురువులను ఘనంగా శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ మంజుల, ఈగ సత్యనారాయణ, ఉపాధ్యాయులు కారుపోతుల విజయ్‌కుమార్, ఈగ హరిప్రసాద్, బండారి భిక్షపతి, వరంగంటి సంతోశ్, నరిగె శివరాజు, విజయ్, రమేశ్, దేవి, తదితరులు పాల్గొన్నారు

‘మాదిగలపై కులవివక్ష సరికాదు’


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎస్‌పీ మంద కుమార్

చెన్నారావుపేట : మాదిగ కులస్తులపై కులవివక్ష చూపడం సరికాదని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మంద కుమార్, జిల్లా అధ్యక్షుడు కల్లెపెల్లి ప్రణయ్‌దీప్ అన్నారు. జిల్లా అధ్యక్షుడు కట్ట రాజశేఖర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కుమార్, ప్రణయ్‌దీప్ మాట్లాడారు.. మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో మాదిగ కులస్తులపై రెడ్డి కులస్తులు దాడులకు పాల్పడుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయని చెప్పారు. కొందరు రెడ్డి కులస్తులు విచ్చలవిడిగా చెలరేగిపోతున్నారని తెలిపారు. వారిపై గతంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైందని చెప్పారు. గ్రామంలో పోలీసులు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి దాడులను అరికట్టాలని కోరారు. సమావేశంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు చిన్నపల్లి రవి, చిలపాక యాకన్న, చిలపాక బాబు, మంద చేరాలు, నవిండ్ల కొమ్మాలు, అనిల్, రాజు, రాము, ప్రవీణ్, నవీన్ పాల్గొన్నారు.

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

సాక్షి నెట్‌వర్క్ : నర్సంపేట, దుగ్గొండి, నెక్కొండ, నల్లబెల్లి, చెన్నారావుపేట, పర్వతగిరి మండలాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. అమ్మవారికి పూజలు నిర్వహించి ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. నర్సంపేట మండలంలోని ముగ్దుంపురంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మహిళలకు ముత్తూట్ ఫైనాన్స్ ఇన్‌చార్జ్ బైరగోరి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో స్టేట్ హెడ్ మదన్‌మోహన్, రీజినల్ మేనేజర్లు నాగ, యుగేంధర్, జోనల్ మేనేజర్ సంతోశ్, స్థానిక బ్రాంచ్ మేనేజర్ మురళీ బహుమతులు పంపిణీ చేశారు.


నెక్కొండ : దుర్గామాత శోభాయాత్రలో భక్తులు


పర్వతగిరి లో..


దుగ్గొండి : శోభాయాత్ర


చెన్నారావుపేట : తరలుతున్న దుర్గాదేవి


నర్సంపేట రూరల్ : బహుమతులు అందజేస్తున్న రాజ్‌కుమార్

కాంగ్రెస్ కార్యకర్తపై కేసు నమోదు

నల్లబెల్లి : దసరా ఉత్సవల ఏర్పాట్లు చేస్తున్న మండల కేంద్రానికి చెందిన గుమ్మడి వేణుపై తన చేతి కడెంతో దాడి చేసిన చంద్రయ్యపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మామిడి అమరేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్ బాబు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండల కేంద్రంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులు చేస్తున్న వేణుపై అమరేందర్ ఉద్దేశపూర్వకంగా దాడి చేసి గాయపరిచాడు. వేణు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రెండు గొర్రెల మృతి

నల్లబెల్లి : విద్యుదాఘాతానికి గురై రెండు గొర్రెలు మృతి చెందిన ఘటన మండలంలోని లక్ష్మితండాలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మేడపల్లి గ్రామానికి చెందిన రైతు గాదం సాంబయ్య తన గొర్రెలను మేత కోసం లక్ష్మితండా శివారులోకి తోలుకెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైర్లు తగిలి రెండు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే గొర్రెలు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయని బాధిత రైతు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. మృతి చెందిన గొర్రెల విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వ నిబంధనల మేరకు తనకు పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

జీవాంజి దీప్తికి ఘనసన్మానం


పర్వతగిరి : దీప్తిని సన్మానిస్తున్న దయాకర్‌రావు


రాయపర్తి : పెర్కవేడులో..

పర్వతగిరి : మండలంలోని కల్లెడకు చెందిన ఒలింపిక్స్ ప్రతిభావని జీవాంజి దీప్తిని ఆమె నివాసంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శనివారం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడారు. దీప్తి ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించడం అభినందనీయమని చెప్పారు. భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

సోదరులకు..

రాయపర్తి : మండలంలోని పెర్కవేడుకు చెందిన సోదరులు గారె కిరణ్, సుమన్‌లను అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. కిరణ్ 2022లో మహాత్మ జ్యోతిరావు పూలే గురుకులంలో నిర్వహించిన నోటిఫికేషన్‌లో పీజీటీ, టీజీటీలో ఉద్యోగం సాధించారు. అనంతరం 2024 డీఎస్సీలో హిందీలో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం దక్కించుకున్నారు. మూడు ఉద్యోగాలు సాధించారు. అలాగే కిరణ్ సోదరుడు సుమన్ 2008లో పదో తరగతిలో ప్రతిభ చాటి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీలో ఎంటెక్ పూర్తి చేసి హైదరాబాద్ ఐఐటీలో పీహెచ్‌డీ సీటు సాధించారు. ప్రస్తుతం ఆయన జర్మనీలో సైంటిస్ట్‌గా పని చేస్తున్నాడు. అన్నదమ్ములు ఉద్యోగాల్లో స్థిరపడడంతో వారిని అంబేడ్కర్ సంఘం సభ్యులు శాలువాలతో సత్కరించి అభినందించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఐనవోలు: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలిలలా.. పంథినికి చెందిన మేకల ఐలయ్య(56) గురువారం వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై పొలం వద్దకు సైకిల్ పట్టుకుని నడుచుకుంటూ వెళ్తుండగా వర్ధన్నపేట వైపు వెళ్తున్న లారీ ఐలయ్యను వెనుకవైపు నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఐలయ్య గాయపడగా చికిత్స నిమిత్తం స్థానికులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఐలయ్య చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి కొడుకు ఫిర్యాదు ఏమరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత



రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన దాసరోజు శివకృష్ణ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు ఈదులకంటి మహిపాల్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి బియ్యం సాయంగా అందజేశారు. తొలుత శివకృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఐరెడ్డి ఎల్లారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ చిర్ర శ్రీధర్, నాయకులు గబ్బెట బాబు, కోల యాకయ్య, చెడుపాక యాకయ్య, దురిశెట్టి రాజు, గాడిపెల్లి పెంటయ్య, బోయిని సాంబరాజు, కొమురయ్య, మహబూబ్‌రెడ్డి, చిర్ర యాకయ్య, బెల్లి గణేశ్, మహేందర్‌రెడ్డి, చిర్ర వేణు, గూడెల్లి వెంకటయ్య, గూడెల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ రూరల్ :
9951602875 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. రాజు యాదవ్ (S.R) : 9502950309 (వర్ధన్నపేట)
డి. కిరణ్ (S.R) : 9949808352 (నర్సంపేట)
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944